క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తానూరు: భైంసా నంచి బెల్‌తరోడా గ్రామానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

ఖానాపూర్: పట్టణంలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం అత్యవసరంగా మరమ్మతులు చేపట్టారు. ఆర్‌ఫేజ్ సీటీ ఆయిల్ లీకేజీ అవుతుండడంతో సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని మండలాలకు సుమారు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు. విద్యుత్ ఆపరేషన్స్ డీఈ నాగరాజు ఆధ్వర్యంలో ఏఈ రాంసింగ్, ట్రాన్స్‌కో బృందం పనుల్లో పాల్గొన్నారు.

అబాకస్ జోనల్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని నారాయణ ఒలింపియాడ్ పాఠశాలలో గురువారం అబాకస్ జోనల్ స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా నారాయణ పాఠశాల ఏజీఎం ప్రసాద్ హాజరవగా.. వివిధ పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏజీఎం మాట్లాడుతూ అబాకస్ సాధనతో పిల్లల మేధోసంపత్తి పెరిగి గణితంలో రాణిస్తారన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, పతకాలు సర్టిఫికెట్లు అందజేశారు. నారాయణ పాఠశాల నిజామాబాద్, ఆదిలాబాద్, ఆర్మూర్, భైంసా, నిర్మల్ శాఖల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బస్తాల లారీ బోల్తా



కాలువలో పడిన లారీ

సారంగాపూర్: ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు సిమెంట్ బస్తాలతో వస్తున్న లారీ మండలంలోని రాణాపూర్ గ్రామ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువలో పడిపోయింది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం డ్రైవర్ నిర్లక్ష్యంతో లారీ కాలువలో పడినట్లు పేర్కొన్నారు. ఈప్రమాదంలో డ్రైవర్ తలకు గాయాలవగా క్లీనర్ క్షేమంగా బయటపడ్డాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి

భైంసాటౌన్: ఆర్టీసీ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆదిలాబాద్ రీజియన్ డిప్యూటీ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు నిర్వహించిన 'పవర్' కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. డీఎం హరిప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఉద్యోగులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు



పంప్‌హౌస్ పరిశీలిస్తున్న అధికారులు

కుంటాల: మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ శుద్ధజలం అందిస్తున్నామని ఎంపీడీవో లింబాద్రి పేర్కొన్నారు. గురువారం కుంటాలలోని పంప్‌హౌస్ ను పరిశీలించారు.వేసవిలో నీటిఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం వైకుంఠ ధామం, సెగ్రిగేషన్ షెడ్, నర్సరీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దత్తు రాంపటేల్, కార్యదర్శి రాజబాపు, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలని అధ్యాపకుల ప్రచారం

ఖానాపూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని కళాశాల అధ్యాపకులు సంతోష్‌రెడ్డి, రవీందర్, మోహన్, రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని పాతఎల్లాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించి పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఇంటర్ కోసం ప్రభుత్వ కళాశాలలో ప్రవేశం పొందాలని కోరారు. హెచ్‌ఎం రమాదేవి తదితరులు ఉన్నారు.

వాహనాలు తనిఖీ

లోకేశ్వరం: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అశోక్ అన్నారు. గురువారం మండలంలోని మన్మద్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్సై మాట్లాడుతూ వాహనాల ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్సై దిగంబర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఊపందుకున్న ఉపాధి

- లక్ష్మణచాంద మండలం పనిదినాల లక్ష్యం 3,13,491
- సకాలంలో వేతనాలు అందజేత
- పనులపై కూలీల ఆసక్తి



పొట్టపెల్లి(కే)లో నిర్మించిన పశువుల షెడ్డు



మల్లాపూర్‌లో మట్టి రోడ్డు నిర్మిస్తున్న ఉపాధి కూలీలు

లక్ష్మణచాంద: గ్రామాల్లో వలసలు నివారించి ఉన్న ఊరిలో ఉపాధి కల్పించేందుకు తీసుకొచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ పథకం కింద జాబ్‌కార్డు కల్గిన కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను లక్ష్మణచాంద మండలంలో కూలీలకు 3,13,491 పనిదినాలను కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఫిబ్రవరి మాసంలో ఇప్పటివరకు వివిధ గ్రామాల కూలీలకు 2,32,369 రోజుల పని కల్పించినట్లు ఈజీఎస్ అధికారులు తెలిపారు. వచ్చే మార్చి నెల వరకు మిగిలిన 81,122 పని దినాలు కూలీలకు కల్పించి నిర్దేశించిన లక్ష్యం చేరుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు.

పెరిగిన డిమాండ్..

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి పనులు చేసిన భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12వేలు అందిస్తామని పేర్కొంది. దీంతో గ్రామాల్లో ఉపాధి పనులకు మరింత డిమాండ్ పెరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. పనులు ఎప్పుడు ప్రారంభమైతే అప్పుడు వస్తామని కొందరు కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్లను కలిసి కోరుతున్నారని పేర్కొన్నారు.

రైతులకు తప్పిన ఆర్థికభారం..

గతంలో తమ పొలాలకు వెళ్లేందుకు రైతులే తలా కొంత నగదు జమ చేసుకొని రోడ్డు వేసుకునేవాళ్లు.. ప్రస్తుతం ఉపాధిహామీ పథకం కింద రోడ్డు నిర్మిస్తుండటంతో రైతులకు ఆర్థిక భారం తప్పినట్లయింది.

మండలంలో 9,527 జాబ్ కార్డులు..

లక్ష్మణచాంద మండలంలో 18 గ్రామపంచాయతీల పరిధిలో 23 గ్రామాలున్నాయి. వాటి పరిధిలో 9,527 జాబ్ కార్డులు ఉండగా.. ఇందులో 6,246 యాక్టివ్ జాబ్ కార్డులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు మండలంలో 11 మంది కూలీలు వందరోజుల పని దినాలు పూర్తి చేసుకోగా గ్రామాల్లో నాలుగు మట్టిరోడ్లు నిర్మించారు. 175 ఇంకుడుగుంతలు, 25 పశువుల పాకలు నిర్మించి ఇచ్చారు. పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకున్న రైతులకు చెందిన 65 ఎకరా ల్లో ఆయిల్ పాం, నాలుగు ఎకరాల్లో తైవాన్ జా మ మొక్కలు నాటినట్లు వివరించారు.

పథకం కింద చేపడుతున్న పనులివే..

- గ్రామాల్లోని కాలువలు, కుంటలు, చెరువుల్లో మట్టి పూడికతీత పనులు చేపట్టి నీటి నిల్వ పెంచుతున్నారు. పొలాలకు వెళ్లేందుకు బండ్లబాట(మట్టిరోడ్డు) నిర్మిస్తున్నారు.
- అడవుల్లో వర్షపునీరు నిలిచేలా కందకాల తవ్వకాలు చేపడుతున్నారు.
- గ్రామాల్లో డ్రెయినేజీలు లేని కాలనీల్లో కచ్చా డ్రెయినేజీలను ఏర్పాటు చేశారు.
- దరఖాస్తు చేసుకున్న రైతుల చేన్లలో ఆయిల్ పాం, తైవాన్‌జామ మొక్కలు నాటుతున్నట్లు పేర్కొన్నారు.
- ఇంకుడుగుంతలు, పశువుల షెడ్లు నిర్మిస్తున్నారు.గ్రామానికో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు గుంతలు కూడా తవ్వుతున్నారు.

మట్టి రోడ్డు నిర్మించారు



గ్రామంలో పొలాలకు వెళ్లేందుకు రోడ్డు లేక రైతులు ఇబ్బంది పడుతుంటే ఈజీఎస్ అధికారులు రోడ్డు వేయించారు. గతంలో ఎరువులు మోసుకెళ్లేవాళ్లం. మాకు ఆర్థిక భారం కూడా తప్పింది. – గంగన్న, రైతు, మల్లాపూర్

షెడ్డు నిర్మించుకున్నా



జాబ్ కార్డు ఉండటంతో ఉపాధిహామీ పథకం కింద పశువుల షెడ్డు నిర్మించుకున్నా. నేను కూడా ఉపాధి పనికి వెళ్తా. పనులకు సంబంధించిన వేతనం కూడా వెంటనే మాకు అందుతుంది. – శ్రీనివాస్, కూలీ, పొట్టపెల్లి

లక్ష్యాన్ని చేరుకుంటాం

ఉపాధిహామీ పథకం కింద మండలానికి నిర్దేశించిన లక్ష్యాన్ని మార్చి నెల వరకు చేరుకుంటాం. గ్రామాల్లో జాబ్‌కార్డు ఉండి అడిగిన వారందరికీ పనులు కల్పిస్తున్నాం. ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య మరింత పెరిగేలా చర్యలు తీసుకుంటాం. – ప్రమీల, ఈజీఎస్ ఏపీఓ, లక్ష్మణచాంద

బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్



కడెంలో మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

కడెం: ఉపాధ్యాయ, పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు మల్క కొమురయ్య, అంజిరెడ్డిని గెలిపించాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ పిలుపునిచ్చారు. గురువారం కడెంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి పాల్గొన్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా బీజేపీ హవా నడుస్తుందని పార్టీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు. ఎన్నికల ఇన్‌చార్జులు మల్లారెడ్డి, కుమార్‌యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ మహేందర్, మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్, రవీందర్‌గౌడ్, రమణారెడ్డి తదితరులున్నారు.

దస్తురాబాద్: బీబీజేపీ బలపర్చిన అభ్యర్థులను ఎమ్మెల్సీలుగా గెలిపించాలని ఎంపీ నగేశ్.. కార్యకర్తలకు సూచించారు. దస్తురాబాద్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రితేశ్ రాథోడ్‌ను సన్మానించారు. ఎమ్మెల్యే రామారావు పటేల్, ఎన్నికల ఇన్‌చార్జులు మల్లారెడ్డి, కుమార్‌యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ అంకం రాజేందర్, మండలాధ్యక్షుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం..

తానూరు: మండలంలోని భోసి శిశుమందిర్, తానూరులోని వాగ్దేవి పాఠశాలలో గురువారం బీజేపీ నాయకులు ఆ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థుర్థులు అంజిరెడ్డి, కొమురయ్యలను గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మణ్‌రెడ్డి, విశ్రాంతి ఉపాధ్యాయుడు మోహన్‌రెడ్డి, మారోతి, ఎల్లప్ప, రాజశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ రాక

ముథోల్/లోకేశ్వరం/కుంటాల: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ముథోల్‌కు ఎంపీ నగేశ్ రానున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు పోతన్న ఓ ప్రకటనలో తెలిపారు. లోకేశ్వరం వేంకటేశ్వర కల్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించే ఎన్నికల ప్రచారానికి ఎంపీ హాజరవుతారని బీజేపీ మండల కన్వీ నర్ సాయన్న తెలిపారు.

కుంటాలకు శుక్రవారం ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్ రానున్న ట్లు మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ తెలిపారు. గురువారం కుంటాలలో మాట్లాడారు. మేసినేని వెంకట్ రావు, చిన్నన్‌రావు, గోవర్ధన్, మునీశ్వర్‌రాజు, గాండ్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ వుషూ పోటీలకు ఎంపిక



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

భైంసాటౌన్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అమెచ్యూర్ వుషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 18,19 తేదీల్లో జరిగిన పోటీల్లో ఖేలో ఇండియా ఉమెన్స్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పతకాలు సాధించి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ సాయికృష్ణ తెలిపారు. జిల్లా నుంచి 39మంది క్రీడాకారులు పాల్గొనగా, ఐదుగురు బంగారు, ఇద్దరు రజతం, ఎనిమిది మంది కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు..

లోలం మమత, నక్షత్ర, ఈశ్వరి, గౌరీబాయి, భాగ్యలక్ష్మి బంగారు పతకాలు సాధించగా.. ప్రణతి, శృతి రజత పతకాలు, మైథిలి, కౌశర్, వైష్ణవి, సోని, స్వాతి, శైలజ, షేక్ జోయ, శ్రీరాముల కృషిక కాంస్య పతకాలు సాధించారు. క్రీడాకారులను జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.

సంక్షిప్త వార్తలు

కబడ్డీ పోటీలు

ముథోల్: మండలంలోని తరోడా గ్రామపంచాయతీ పరిధి సేవాలాల్ తండాలో జగదాంబమాత, సేవాలాల్ మహరాజ్ ఆలయ ప్రాంగణంలో గురువారం కబడ్డీ పోటీలు ఘనంగా నిర్వహించారు. తండా క మిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఆరు జట్లు పాల్గొన్నాయి. ప్రథమస్థానంలో నిలిచిన ముథోల్ జట్టుకు రూ.11,111, ద్వితీయ స్థానంలో నిలిచిన తరోడా తండా జట్టుకు రూ.5,051 అందించారు. మాజీ సర్పంచ్ అరిఫొద్దీన్, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

నిర్మల్‌టౌన్: ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆర్యవైశ్య మహిళ రేఖా గుప్తాను నియమించినందుకు నిర్మల్ పట్టణ ఆర్యవైశ్యుల యువజన సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు జిల్లాకేంద్రంలోని ప్రియదర్శిని నగర్ చౌరస్తాలో గురువారం ప్రధాన మంత్రి మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు గందె రాకేశ్, సభ్యులు నారాల స్వప్నిక్, చకినాల శ్రీనివాస్, జొన్నల సునీల్, లక్ష్మీనారాయణ, గణేశ్, రమేశ్, శివ పాల్గొన్నారు.

ప్రతిష్ఠాపన మహోత్సవం

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో కొనసాగుతున్న భక్తాంజనేయస్వామి నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం రెండోరోజుకు చేరుకుంది. గురువారం పండితులు బ్రహ్మశ్రీ కుప్పకంటి సురేశ్‌శర్మ ఆధ్వర్యంలో షోడశస్తంభ పూజ, యాగశాల ప్రవేశం, దేవతాహ్వానం, వైదికాజ్ఞి, స్థాపిత దేవతాహవనం, జలాధివాసం, తీర్థప్రసాద సేవనం, హోమం జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

భైంసాటౌన్: కుభీర్ మండలం కుప్టి గ్రామ మాజీ సర్పంచ్ గడేకర్ రమేశ్ బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ మేరకు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పి.రమాదేవి ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. కేటీఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరి వెంట గంగాధర్, సతీశ్, అక్షయ్, బాబు ఉన్నారు.

ప్రారంభమైన సప్తాహం

ముథోల్: మండలకేంద్రంలోని పశుపతినాథ్ ఆలయ ప్రాంగణంలో గురువారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అఖండ హరినామ సప్తాహం ప్రారంభించారు. ఏడు రోజులపాటు ఘత భజన, కీర్తనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం అన్నదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మినీ గురుకులం తనిఖీ

మామడ: మండలకేంద్రంలోని మినీగురుకులాన్ని గురువారం ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఉపాధ్యాయురాలు నీల ఉన్నారు.

వృద్ధుడు అదృశ్యం.. కేసు నమోదు



గోపిచంద్ (ఫైల్)

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీతాండ గ్రామానికి చెందిన జాదవ్ గోపిచంద్ (60) అనే వృద్ధుడు బుధవారం ఉదయం నర్సాపూర్(జి) వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. బంధువులు, చుట్టు పక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. గురువారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో గోపిచంద్ అన్న కొడుకు జాదవ్ పీ రాజీ ఫిర్యాదు చేశాడు. అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు.

బోరుబావికి మరమ్మతు

మామడ: రానున్న వేసవికాలం నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చ ర్యలు తీసుకుంటామని ఎంపీవో గంగాసాగర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వె ంకటపూర్‌తండాలో బోర్‌వెల్ పనిచేయకపోవడంతో మరమ్మతు చేయించి సమస్యను పరిష్కరించారు.

సమీకృత వ్యవసాయ క్షేత్రం పరిశీలన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఆర్డీవో

నిర్మల్‌రూరల్: నిర్మల్‌రూరల్ మండలంలోని కొండాపూర్ గ్రామంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం కొండాపూర్ హైస్కూల్ విద్యార్థులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో విజయలక్ష్మి మాట్లాడుతూ సమీ కృత వ్యవసాయంలో భాగంగా కూరగాయలు, చేపల పెంపకం, కంపోస్ట్ తయారీ విధానం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఏటీఎం బోస్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి'

భైంసాటౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. గురువారం భైంసాకు వచ్చిన ఆయన మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణ్‌రావు పటేల్ వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం పని చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, భైంసా ఏఎంసీ చైర్మన్ సిందే ఆనంద్‌రావు పటేల్, వైస్‌చైర్మన్ ఫారూక్, మురళీగౌడ్, రాజన్న, తదితరులు ఉన్నారు.

ఎడ్ల అపహరణకు యత్నం.. వ్యక్తిపై కేసు

తానూరు: మండలంలోని ఉమ్రి(కే)లో గ్రామానికి చెందిన గంగాధరోల్ల రామ్ అనే రైతుకు చెందిన ఎడ్లను అపహరించేందుకు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. భైంసా మండలం కుంసర గ్రామానికి చెందిన పవార్ మారోతి బుధవారం రాత్రి ఉమ్రి (కే) శివారులోని మొక్కజొన్న చేను వద్ద కట్టేసి ఉన్న రెండు ఎడ్లను చోరీ చేసి భైంసా వైపు తోలుకెళ్లాడు. ఇంట్లో అన్నం తిని మళ్లీ చేను వద్దకు వెళ్లేసరికి రామ్‌కు ఎడ్లు కనిపించలేదు. దీంతో పలువురు రైతుల సాయంతో ఎడ్ల కోసం వెతుకుతూ శిరాల ఎక్స్ రోడ్డు వరకు వెళ్లారు. అక్కడ కన్పించిన ఎడ్లను పట్టుకుని దొంగతనానికి యత్నించిన మారోతిని తానూరు పోలీసులకు అప్పగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం మారోతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో అమ్మవారు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న శ్రీ ముత్యాల పోచమ్మ ఆలయ 19వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మహా గణపతి సహిత గౌరీ పూజ, పుణ్యాహవచనం, మహా జలాభిషేకం, యాగశాల ప్రవేశం, అఖండ దీపస్థాపన, క్షేత్రపాలక సర్వతోభద్ర మండల ప్రధాన కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, రుద్రసహిత చండీ యాగం, అమ్మవారి ఆలయానికి అష్టబలులు, మహా పూర్ణాహుతి, అమ్మవారి దర్శనం, పోతరాజుల విన్యాసాల నడుమ బోనాల ఊరేగింపు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. పండితులు నిమ్మగడ్డ శరత్ చంద్రశర్మతోపాటు తదితర పండితుల ఆధ్వర్యంలో పలు పూజాది కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం అందజేశారు.

'బేటీ బచావో బేటీ పడావో'పై అవగాహన



కుభీర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

సారంగాపూర్: బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్‌వో అన్నపూర్ణ అన్నారు. మండలంలోని జామ్ కేజీబీవీలో విద్యార్థినులకు సైబర్‌నేరాలు, షీటీమ్, భరోసా, చైల్డ్ హెల్ప్ లైన్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. బేటీబచావో.. బేటి పడావో కార్యక్రమం పదేళ్లు పూర్తయిన సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ 1098, డయల్ 100, 1930 నంబ ర్లు, గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌ల గురించి విద్యార్థులకు వి వరించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది మమత, రాజు ఉన్నారు.

కుభీర్: మండలకేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బేటీ బచావో.. బేటీ పడావో పథకం ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా అవగాహన కల్పించారు. ఆడపిల్లలంటే చిన్న చూపు చూడకుండా బాలురుతో సమానంగా చ దువు చెప్పించాలని సూచించారు. హెచ్‌ఎం నాయుడు చిన్నన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజశ్రీ, సుజాత, సిబ్బంది శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు యశోద, సత్యశీల తదితరులు ఉన్నారు.

డీపీవో విచారణ



విచారణ జరుపుతున్న డీపీవో శ్రీనివాస్

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో సర్వేనంబర్ 686లో ఏడు గుంటల భూమి తనదంటూ నర్సాపూర్ (జి) గ్రామానికి చెందిన ముప్కం సత్తమ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు ఆదేశాలతో గురువారం డీపీవో శ్రీనివాస్, తహసీల్దార్ సోమ శ్రీనివాస్ విచారణ చేపట్టారు. అనంతరం సదరు భూమిలో సర్వేయర్‌తో కొలతలు చేపట్టారు. పూర్తి వివరాలతో కూడిన నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు డీపీఓ తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రమేశ్, ఎంపీఓలు తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శులు రాథోడ్ కై లాస్, వీణారెడ్డి, ఆర్ఐ వేణుగోపాల్, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. గురువారం మండలంలోని తురాటి గ్రామంలో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో సేవలను తెలుసుకున్నారు. నర్సరీ, పల్లె ప్రకృతివనం, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. ఎంపీఓ తిరుపతిరెడ్డి, కార్యదర్శి రాజు ఉన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి

లోకేశ్వరం: నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు ఎండిపోకుండా నీళ్లు అందించాలని ఎంపీడీవో వెంకటరమేశ్.. సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని హవర్గ, బిలోలి, సాథ్‌గాం గ్రామాల్లోని నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్లు, పల్లె ప్రకృతివనాన్ని ఎంపీడీవో పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సోలమాన్‌రాజ్, ఏపీవో జగన్నాథ్, కార్యదర్శులు ఉన్నారు.

దస్తురాబాద్: నర్సరీల్లో మొక్కలను సంరక్షించుకునేందుకు గ్రీన్‌మ్యాట్లు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని ఆకొండపేటలో పల్లె ప్రకృతివనం, డంపింగ్ యార్డు, నర్సరీని పరిశీలించారు. నిర్లక్ష్యం వహిస్తే కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యదర్శి వెంకటరమణ, కూలీలు తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

పెంబి: గ్రామాల్లో నర్సరీల ఏర్పాటులో నిర్లక్ష్యం చేయవద్దని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని మందపల్లి లో నర్సరీని పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీపీవో కార్యాలయంలో ఈజీఎస్, ఐకేపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. అర్హులు పశువుల పాకలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో అనిల్‌కుమార్, ఏపీఎం గంగారెడ్డి, ఏపీవో రాజశేఖర్, ఎఫ్ఏ భూమన్న, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణంపై అవగాహన



సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

సోన్: పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన మండలంలోని సంఘంపేటలో గురువారం ఎంపీడీవో సురేశ్ ఆధ్వర్యంలో ఫ్రీ గ్రౌండ్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 42 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వం రూ.5 లక్షలను నాలుగు విడుతలుగా చెల్లించడంతోపాటు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం మోడల్ ఇందిరమ్మ ఇల్లును ప్రదర్శించారు. కార్యక్రమంలో డీఈఈ గంగాధర్, ఎంపీఓ ఖలీల్ హైమద్, కార్యదర్శులు ప్రియాంకరెడ్డి, అశోక్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.